



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం,
నవంబర్ 22, 2024

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


భారత కుబేరుడు, అదానీ గ్రూప్ సంస్థల చైర్మన్ గౌతమ్ అదానీపై అమెరికాలో కేసు నమోదైంది. యూఎస్ కోర్టు ఆయనపై అరెస్టు వారెంట్ కూడా జారీ చేసింది. మోసం, లంచం ఆరోపణలపై ఈ వారెంట్ జారీ చేశారు. భారత్‌లో సోలార్ పవర్ ప్రాజెక్టులు దక్కించుకోవడానికి అదానీ గ్రూప్.. వివిధ రాష్ట్రాల్లోని ఉన్నతాధికారులకు 265 మిలియన్ డాలర్లు (రూ. 2,238 కోట్లు) లంచంగా ఇవ్వజూపినట్టు న్యూయార్క్‌లోని ఫెడరల్ కోర్టులో అభియోగాలు నమోదయ్యాయి.

# అదానీపై అమెరికా అరెస్ట్ వారెంట్

## మోసం, లంచం ఆరోపణలపై కేసు నమోదు

## మేనల్లుడు సాగర్‌తోపాటు మరో ఆరుగురికి కూడా..



సోలార్ ప్రాజెక్టుల కోసం అధికారులకు లంచాలు

2,238 కోట్ల లంచం కోసం రుణాలకు యత్నం

మాయమాటలతో బ్యాంకులు, ఇన్వెస్టర్లకు బురిడీ

ఎఫ్‌సీపీఏ పరిధిలోకి కేసు.. అగ్రరాజ్యం ఎంట్రీ

నేరం రుజువైతే ఐదేండ్ల జైలు, భారీ జరిమానా?!

అమెరికాలో కేసుతో అదానీకి కెన్యా భారీ షాక్

ఎయిర్‌పోర్ట్, విద్యుత్తు లైన్ల కాంట్రాక్టులు రద్దు

హైదరాబాద్: భారత కుబేరుడు, అదానీ గ్రూప్ సంస్థల చైర్మన్ గౌతమ్ అదానీపై అమెరికాలో కేసు నమోదైంది. యూఎస్ కోర్టు ఆయనపై అరెస్టు వారెంట్ కూడా జారీ చేసింది. మోసం, లంచం ఆరోపణలపై ఈ వారెంట్ జారీ చేశారు. భారత్‌లో సోలార్ పవర్ ప్రాజెక్టులు దక్కించుకోవడానికి అదానీ గ్రూప్.. వివిధ రాష్ట్రాల్లోని ఉన్నతాధికారులకు 265 మిలియన్ డాలర్లు (రూ. 2,238 కోట్లు) లంచంగా ఇవ్వజూపినట్టు న్యూయార్క్‌లోని ఫెడరల్ కోర్టులో అభియోగాలు నమోదయ్యాయి. ఇదే విషయమై ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారానికి సంబంధించి గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు, అదానీ గ్రీన్ ఎనర్జీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ సాగర్ అదానీతో పాటు మరో ఆరుగురిపై కేసులు నమోదవ్వడమే గాకుండా అరెస్టు వారెంట్ కూడా జారీ అయినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ప్రపంచ దేశాలు పునరుత్పాదక శక్తి రంగంవైపు అడుగులు వేస్తున్న క్రమంలో సౌర విద్యుత్తు రంగంలో పెద్దయెత్తున పెట్టుబడులు పెట్టాలని అదానీ గ్రూప్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా భారత్‌లో భారీ సోలార్ ఎనర్జీ ప్రాజెక్టులు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది.

2లో



## 25 నుంచి పార్లమెంట్

16 బిల్లులు ప్రవేశపెట్టనున్న కేంద్రం



## సనాతన ధర్మం సమున్నతం

గాలి, నేల, నీరు, నింగి, నిప్పులోనూ దేవుడిని చూస్తాం

ప్రకృతికి దండం పెట్టే పవిత్రమైన హిందూ ధర్మం మనది

ఆ సంస్కృతిని కాపాడుకోవాలి: వెంకయ్య నాయుడు

అట్టహాసంగా లోక్‌మంథన్-2024 ఎగ్జిబిషన్ ప్రారంభం

రాజకీయాలకు అతీతంగా ఉత్సవాలు.: కిషన్‌రెడ్డి




## హస్తినలో మొదలైన ఎన్నికల హడావుడి

అసెంబ్లీ ఎన్నికల కార్యాచరణను ప్రారంభించిన బీజేపీ, ఆప్

11 మందితో అప్పుడే ఆప్ తొలిజాబితా

సన్నాహాల్లో వెనుబడినట్లు కనిపిస్తున్న కాంగ్రెస్

2లో

## మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశాం



మత్స్యకార దినోత్సవం సందర్భంగా గంగపుత్రులకు శుభాకాంక్షలు తెలిపిన వైఎస్ జగన్

వారి స్థితిగతులను మెరుగుపరిచేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశాం

10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం

వేట నిషేధ సమయంలో 1,23,519 కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేశాం

కొండపోచమ్మసాగర్ కోసం తొలుత భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చారు

హరీశ్ రైతుల్ని బెదిరించి భూములు కొన్నాక దాన్ని రద్దు చేశారు

మీడియాతో మంత్రి పొంగులేటి

కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ దగ్గర రైతులను బెదిరించి అప్పటి మంత్రి హరీశ్‌రావు భూములు కొనుగోలు చేశారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంపై విచారణ జరుగుతోందని చెప్పారు.

# హరీశ్‌రావు కొన్న భూములపై విచారణ



హైదరాబాద్: కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ దగ్గర రైతులను బెదిరించి అప్పటి మంత్రి హరీశ్‌రావు భూములు కొనుగోలు చేశారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంపై విచారణ జరుగుతోందని చెప్పారు. ఈ రిజర్వాయర్ కోసం తొలుత భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేశారని.. దీనివల్ల రైతుల భూములు పోతాయని బెదిరించి హరీశ్ ఆ భూములు కొన్నారని ఆయన ఆరోపణలు గుప్పించారు. హరీశ్ భూములు కొన్నాక భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేశారని దుయ్యబట్టారు. రైతుల నుంచి చట్టబద్ధంగా భూములు కొన్నానని...

2లో

# రంగనాయక్‌సాగర్‌కు ఎప్పుడొస్తవ్ రేవంత్?

## నేను గుంట భూమి కూడా కబ్జా చేయలే

రైతుల నుంచి నిబంధనల ప్రకారం కొన్నా

రేవంత్‌రెడ్డివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

రైతులు, ప్రజల పక్షాన ప్రశ్నిస్తూనే ఉంటం

ధాన్యం సేకరణలో ప్రభుత్వం విఫలం

మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపాటు

రుణమాఫీ అమలులో సర్కార్ విఫలమైంది.



2లో



## విదేశీ విద్యకు సాయమందించండి

డిప్యూటీ సీఎంకు పలువురు తల్లిదండ్రుల విజ్ఞప్తి

వీలున్నంత త్వరగా నిధులు విడుదల చేయిస్తానని హామీ ఇచ్చిన భట్టి

జూనియర్ లెక్చరర్ల పోస్టింగులు ఇప్పించాలని అభ్యర్థన

మంత్రితో ముఖాముఖిలో 300 దరఖాస్తులు

2లో

# వరకట్న హత్యలను, వేధింపులను అరికట్టాలి..

**పోగుల లత హత్యపై సమగ్ర విచారణ చేపట్టండి**

**దోషులకు శిక్ష పడేలా చేసి - చిన్నారి బాబు కు న్యాయం చేయండి**

**నిర్మల్ జిల్లా ఎస్పీ కి విజ్ఞప్తి చేసిన పోగుల లత కుటుంబీకులు, ప్రజా సంఘాలు**



వార్త మిర్రర్ రాయికల్/జగిత్యాల ప్రతినిధి నవంబర్ 21 : ఈ సమాజంలో జరుగుతున్న వరకట్న హత్యలను, వేధింపులను అరికట్టాలని పోగుల లత న్యాయ పోరాట కమిటి ఆధ్వర్యంలో గురువారం నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిలకు లత కుటుంబీకులు, మహిళా, ప్రజా, హక్కుల సంఘాల నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లికి చెందిన పోగుల (సంద) లత నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండలం రేవోజిపేట లో ఈనెల 8న హత్య జరిగిన సంగతి తెలిసిందే.. ఈ హత్యపై సమగ్ర విచారణ చేపట్టి, దోషులకు చట్టపరంగా శిక్ష పడేలా చేసి - లత కొడుకు అయిన 18 నెలల చిన్నారి బాబుకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తో పాటు డిఎస్పీ ఎ.గంగారెడ్డి లకు వేర్వేరుగా ప్రత్యేక వినతి పత్రాలు అందజేశారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం రేవోజీపేట లో ఈ నెల 8న జరిగిన అదనపు వరకట్న వేధింపుల హత్యలో మరణించిన పోగుల లత కేసు పట్ల పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి చట్ట పరంగా సరైన న్యాయం చేయాలని వారు జిల్లా ఎస్పీని కోరారు. పోగుల లత వివాహం జరిగిన నుండి హత్య జరిగిన రోజు వరకు చోటు చేసుకున్న సంఘటనలు, అదనపు వరకట్న వేధింపులు, లత హత్య పై గల అనుమానాలను, ఇతరత్రా విషయాలను ఆ వినతి పత్రాల ద్వారా జిల్లా ఎస్పీ కి వివరించారు. ఇలాంటి వరకట్న హత్యలు, వేధింపులు, బాల్య వివాహాలు, మహిళలపై అఘాయిత్యాలు చోటు చేసుకోకుండా చూడాలని పోగుల లత న్యాయ పోరాట కమిటి ఎస్పీ డా.జానకి షర్మిల ను కోరారు. లత హత్యనే ఈ రాష్ట్రంలో చివరి హత్య కావాలని, ఇక ముందు ఇలాంటివి రాష్ట్ర వ్యాప్తంగా మరెక్కడా కూడా జరుగకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల మాట్లాడుతూ నేను కూడా సాటి మహిళనే.... అని, ఇలాంటి దుర్మార్గపు చర్యలను తిప్పి కొట్టే బాధ్యత మాపై ఉందని అన్నారని, ఈకేసు విషయంలో ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని జిల్లా ఎస్పీ తెలిపారని అన్నారు. ఒక మహిళ గా ఈ సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను అరికట్టి సమాజానికి నా వంతు సేవ చేయాలనే తపనతోనే ఉద్యోగంలో చేరానని జిల్లా ఎస్పీ తెలుపడం మాకు గర్వంగా ఉందని మహిళా సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు.

నిర్మల్ జిల్లా ఎస్పీని కలిసిన వారిలో పోగుల లత న్యాయ పోరాట కమిటి కన్వీనర్ అయిన ఐద్వా జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్గొండ పద్మ, కో- కన్వీనర్లు గా ఉన్న చైతన్య మహిళా సంఘం రాష్ట్ర నాయకురాల్లు కే.శ్రీదేవి, ఒటారికారి శ్రీదేవి, సుశీల, పోగుల మల్లేశ్వరి, జల, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమార స్వామి, రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు ముని మడుగుల మల్లన్న, మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దేవి సత్యం, ప్రజా సంఘాల నాయకులు బొమ్మేన రాకేష్, రజక ఉద్యోగుల సంక్షేమ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షులు డా. యం.గజ్జారాం, నిర్మల్ జిల్లా సామాజిక కార్యకర్త బాల్నేని అజయ్, విరసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజా సంఘాల నాయకులు పుట్ట రాజన్న, తెలంగాణ జాయింట్ ఆక్షన్ కమిటి రాష్ట్ర స్టీరింగ్ కమిటి సభ్యులు, జగిత్యాల జిల్లా కో ఆర్డినేటర్ పొన్నం రాజ మల్లయ్య, తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి, దళిత లిబరేషన్ ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ రామిళ్ళ బాపు, తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కో కన్వీనర్ గాండ్ల మల్లేశం, పోగుల తిరుపతి, ఓరగంటి రమేష్, రంగు మల్లేష్, కానగంటీ నర్సయ్య, పోగుల శ్రీను, తంగెళ్ళ చంద్ర మౌళి, వొడ్నాల రాజేశం, వొడ్నాల శంకర్, సాతల్ల రమేష్, కాసారపు గణేష్ తదితరులు ఉన్నారు.

# మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ వైఖరికి కాంగ్రెస్ కౌన్సిలర్స్ నిరసన

మిర్యాలగూడ, నవంబర్ 21:-( వార్త మిర్రర్ ప్రతినిధి) : మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని చైర్మన్ వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ కౌన్సిలర్లు బహిష్కరించి నిరసన తెలిపారు. తొలుత స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి కాంగ్రెస్ కౌన్సిలర్లు ర్యాలీగా ప్ల కార్డులు చేత బూని మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని సమావేశ మందిరంలో నిరసన తెలిపి, కార్యాలయ ద్వారం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న మున్సిపల్ చైర్మన్ గత 15 సంవత్సరాలుగా మున్సిపల్ ఖజానా దోచుకొని ఎన్నో అవినీతి పనులు చేసి ఈరోజు డ్రామాలు ఆడుతున్నారన్నారు అంటూ విమర్శించారు. దొంగనే, దొంగ దొంగ అని అరవడం ఏంటని ప్రశ్నించారు. అక్రమ కట్టడాలకు పాల్పడుతూ, టీఎస్ పాస్ అనుమతులున్న వాటికి కూడ అవినీతికి పాల్పడిన తానే గత కొన్ని సంవత్సరాలుగా కమిషన్లు తింటూ ఎప్పుడు ఆర్టీఐ ద్వారా సమాచారం కోరుతూ లేఖ రాయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పార్టీ కండువా మార్చి మరల దోచుకోవాలని చూస్తున్న చైర్మన్ కి కాంగ్రెస్ పార్టీలో బహిష్కరించడంతో కొత్త డ్రామాని తెరపైకి తెచ్చి ప్రజలను, అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. చైర్మన్ కమిషన్లు కావాలన్న ప్రతీసారి ఇలా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లో టెండర్స్ అంటూ షాప్స్ వారిని బ్లాక్ మెయిల్ చేసి వారి నుంచి డబ్బులు వసూలు చేయడం చైర్మన్ కు ఎన్నో సంవత్సరాల నుంచి అనుభవం అని అన్నారు. ఇలాంటి అవినీతి పరులను మా కాంగ్రెస్ పార్టీలోకి రానివ్వమంటూ నినాదాలు



చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్, తలకోప్పుల సైదులు? డిసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎంఈ.సలీం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ అజహరుద్దీన్, కౌన్సిలర్ల ముదిరెడ్డి నర్శిరెడ్డి, డి. శేఖర్ రెడ్డి, రవినాయక్, యాదగిరిరెడ్డి, గంధం రామకృష్ణ, ఎస్కే జావేద్, కొమ్మన నాగలక్ష్మి, పందిరి అనిత, శాగం జయలక్ష్మి, చంద్రకళ, వార్డు ఇన్చార్జిలు షేక్ అబ్దుల్లా, మోయిజ్, శరత్, చల్ల వెంకన్న, అమృతారెడ్డి, బాసని గిరి, బి. సైదులు పాల్గొన్నారు.

# సనాతన ధర్మం సమున్నతం



**(మొదటి పేజీ తరువాయి)**

హైదరాబాద్: భారతీయ సనాతన ధర్మం ఎంతో ఉన్నతమైనదని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. రాతిలోనూ ప్రాణిలోనూ.. అలాగే గాలి, నీరు, నింగి, నేల, నిప్పులోనూ భగవంతుడిని చూస్తామని.. ఆ సంస్కృతిని మనం కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. "చీమకు చక్కెరపెట్టి, పాముకు పాలు పోసి, చెట్టుకు పసుపుపెట్టి, ప్రకృతికి దండం పెట్టే పవిత్రమైన జాతి మనది.. హిందూ ?ధర్మం మనది. దురదృష్టవశాత్తు పాశ్చాత్య వ్యామోహం వైపు వెళుతున్నాం" అని విచారం వ్యక్తం చేశారు. ఇంగ్లిషు వాళ్లు దండయాత్ర చేసి.. బంగారం, వజ్రవైఢుర్యాల రూపంలో ఆర్థికంగా మనల్ని దోచుకెళ్లడమే కాకుండా మన మనసులనూ దోచుకెళ్లారని.. ఆ కారణంగా మన సాహిత్యం, సంగీతం, వాయిద్యం, భాష, సంస్కృతులను మరిచిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో మళ్లీ భారతీయ మూలాలకు మనం వెళ్లాలి అని పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్ శిల్పారామంలో ఏర్పాటుచేసిన లోక్‌మంథన్-2024లో భాగంగా గిరిజన సంప్రదాయ వాయిద్యాల ఎగ్జిబిషన్‌ను వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులతో కలిసి ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకయ్య మాట్లాడారు. మన పూర్వీకులు అందించిన సంస్కృతిని పరిరక్షించుకోవాలన్నారు. ఒకప్పుడు సంగీతం, సాహిత్యం, వాయిద్యం ఉండేవని.. ఇప్పుడవి పోయి.. జింగిరి బింగిరి సాహిత్యం, సంగీతంతో పాటలు వస్తున్నాయని... మన సంస్కృతిని, భాషను మరచిపోవడమే దీనికి కారణమని వివరించారు. ఇంగ్లిషుపై వ్యామోహం పనికిరాదన్నారు. తొలి ప్రాధాన్యం మాతృభాషకు ఇవ్వాలని.. అమ్మభాష కంటిచూపు అయితే ఇంగ్లిషు కళ్లజోడులాంటిదన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ మాతృభాషలోనే చదువుకున్నారని, ఉపరాష్ట్రపతిగా పనిచేసిన తానూ వీధిబడిలో తెలుగులోనే చదువుకున్నానని చెప్పారు. శక్తి సామర్థ్యాలు, నీతి, నిజాయితీ, వ్యక్తిత్వం ఉండాలిగానీ, పాశ్యాత్య వ్యామోహం కాదని హితవు పలికారు. తాను ఉపరాష్ట్రపతి అయ్యాక వేష?ధారణ (డ్రెస్) మార్చుకుంటారా? అని నన్ను అడిగితే, అది మార్చుకునే ప్రసక్తేలేదని, అడ్రస్ మాత్రమే మారిందని చెప్పినట్లు గుర్తుచేశారు. కుటుంబ వ్యవస్థ, పెళ్లిళ్లు విచ్ఛిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ కుటుంబ వ్యవస్థను పటిష్టపరచాలని పిలుపునిచ్చారు.

# అదానీపై అమెరికా అరెస్ట్ వారెంట్

ఈ క్రమంలో ఎలాంటి పోటీ లేకుండా కాంట్రాక్ట్ టెండర్లను దక్కించుకొనేందుకు ఏపీ, ఒడిశా, తమిళనాడు, జమ్ముకశ్మీర్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని ఉన్నతాధికారులకు అదానీ గ్రూప్ ప్రతినిధులు రూ. 2,238 కోట్ల మేర లంచాలు ఆఫర్ చేసినట్టు అమెరికా ఎఫ్‌బీఐ తన ఆరోపణల్లో వెల్లడించింది. తద్వారా వచ్చే 20 ఏండ్లలో కనిష్ఠంగా 2 బిలియన్ డాలర్లు లబ్ధి పొందేందుకు అదానీ గ్రూప్ ప్రణాళిక సిద్ధం చేసినట్టు ఆరోపించింది. ఈ లంచం సొమ్మును సేకరించడానికి బ్యాంకులు, పెట్టుబడిదారులకు తప్పుడు సమాచారం ఇచ్చి మోసపుచ్చే ప్రయత్నాలు చేసినట్టు తెలిపింది. అమెరికా ఫెడరల్ కోర్టులో అదానీకి సంబంధించి ముఖ్యంగా రెండు అభియోగాలు నమోదైనట్టు అంతర్జాతీయ పత్రిక రాయిటర్స్ వెల్లడించింది. అందులో ఒకటి.. తప్పుడు సమాచారం చూపించి 2 బిలియన్ డాలర్ల మేర రుణాలకు అర్జీ పెట్టడం కాగా రెండోది.. అంతర్జాతీయ ఫైనాన్షియల్ సంస్థలు ఇచ్చిన భరోసాను చూపించి అమెరికాతో పాటు ఇతర దేశాల్లోని మదుపర్లకు 1 బిలియన్ డాలర్ల విలువైన బాండ్లను ఆఫర్ చేయడం. ఈ రెండు అభియోగాలపై న్యూయార్క్‌లోని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ కోర్టు అదానీ సహా ఏడుగురికి నోటీసులు జారీ చేసింది. మరోవైపు, ఫెడరల్ సెక్యూరిటీ చట్టాలను ఉల్లంఘించిన కారణంగా గౌతమ్ అదానీ, సాగర్ అదానీతో పాటు ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న అజూరా పవర్ అనే కంపెనీకి కూడా ఇదే కేసులో తాము నోటీసులు పంపించినట్టు యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) ఒక ప్రకటనలో వెల్లడించింది. కాగా, ఈ కేసులో నిందితులు ఎఫ్‌బీఐ, ఎస్ఈసీ దర్యాప్తును అడ్డుకోవడానికి కుట్ర పన్నినట్టు కోర్టు ఈ సందర్భంగా పేర్కొనడం గమనార్హం. అదానీ గ్రూప్ తాజా వ్యవహారం అమెరికాలోని ఫారెన్ కరప్ట్ ప్రాక్టిసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ) చట్టం ఉల్లంఘన కిందకే వస్తుందని అక్కడి న్యాయకోవిదులు చెప్తున్నారు. అమెరికా కంపెనీలు, వ్యక్తులు విదేశాల్లో అవినీతి పనుల్లో భాగం కాకుండా చూడటమే ఈ చట్టం లక్ష్యం. ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే అమెరికాలో తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు.



## పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గోపాలమిత్ర వైద్య శిబిరం

మిర్యాలగూడ నవంబర్ 21:- (వార్తమిర్రర్) : నల్లగొండ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం మిర్యాలగూడ మండలం అలగడప గ్రామంలో గోపాలమిత్ర పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో 62 గేదెలకు పలు రకాల వ్యాధులను గుర్తించి వాటికి సంబంధించిన వైద్యాన్ని అందించారు. మరియు 40 దూడలకు నట్టల నివారణ మందులను తాగించారు. కార్యక్రమంలో ఆలగడప పశు వైద్యశాల పశువైద్యాధికారి డాక్టర్ నాయిని దుర్గారమాదేవి, తుంగపాడు పశువైద్యాధికారి డాక్టర్ సిహెచ్.జ్ఞానేశ్వర్ ప్రసాద్, జెవిఓ జానీపాషా, వెంకటేశ్వర్లు, విఏ శ్రీకాంత్, గోపాలమిత్ర సూపర్వైజర్ ఎం.శివారెడ్డి, గోపాలమిత్రలు హరికృష్ణ. వెంకట్ రెడ్డి, ప్రభాకర్, దైద శ్రీను, అశోక్, సందీప్, నాగరాజు, రైతులు పాల్గొన్నారు

# 25 నుంచి పార్లమెంట్

న్యూఢిల్లీ: ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ శీతాకాల సమావేశాలు అదానీ అవినీతి అంశంపై వేడెక్కనున్నాయి. ఈ సమావేశాల్లో పెండింగ్‌లో ఉన్న వక్ఫ్ సవరణ బిల్లు సహా మొత్తం 16 బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టనుంది. ఆగస్టులో సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును ఉభయ సభల జాయింట్ కమిటీ అధ్యయనం కోసం పంపారు. శీతాకాల సమావేశం ప్రారంభమైన తొలివారం ఆఖరిరోజు ఈ నివేదిక సమర్పించాలని గతంలోనే నిర్ణయించారు. దీంతో వారు నివేదిక ఇచ్చిన అనంతరం బిల్లుకు ఆమోదం తెలిపే అవకాశాలున్నాయి. ఒకే దేశం-ఒకే ఎన్నిక నినాదంతో జమిలి ఎన్నికలపై రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదికను మంత్రివర్గం ఇదివరకే ఆమోదం తెలిపింది. అయితే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే కొత్త బిల్లుల జాబితాలో ఇది లేకపోయినప్పటికీ ఈ సమావేశంలోనే దీనిని కూడా ప్రవేశపెడతారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఐదు కొత్త బిల్లులలో కోస్టల్ షిప్పింగ్ బిల్లు, ద ఇండియన్ పోర్ట్స్ బిల్లు, మర్చంట్ షిప్పింగ్ బిల్లు, కో-ఆపరేటివ్ యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్రీయ సహకార విశ్వవిద్యాలయ బిల్లు, పంజాబ్ కోర్ట్స్ (సవరణ) బిల్లు ఉన్నాయి.

## హస్తినలో మొదలైన ఎన్నికల హడావుడి

న్యూఢిల్లీ: ప్రస్తుతం మహారాష్ట్ర, జార?ండ్ ఎన్నికలు ముగియడంతో క్రమంగా వచ్చే ఏడాది ప్రారంభంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఢిల్లీలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఇప్పటికే తమ ఎన్నికల కసరత్తును బీజేపీ, ఆప్ పార్టీలు ముమ్మరం చేసి దాడి, ఎదురుదాడులను మొదలు పెట్టాయి. ఆప్ నేత కైలాశ్ గహ్లోత్ బీజేపీలో చేరిన తర్వాత రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధం కావడానికి ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ స్వయంగా రంగంలోకి దిగి పలు ప్రాంతాల్లో ఢిల్లీ ప్రజలతో సంప్రదింపులు జరుపుతుండగా, మరోవైపు బీజేపీ తమ ఢిల్లీ నేతలను క్రియా శీలం చేసింది. గురువారం 11 మందితో ఆప్ తొలిజాబితాను సైతం విడుదల చేసింది. వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల కార్యాచరణ ప్రణాళిక, వ్యూహాల అమలులో ఆప్, బీజేపీలు పోటీ పడుతున్నాయి. ఢిల్లీ లిక్కర్ పాలసీలో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాలతో పాటు మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ అరెస్టులపై తీవ్ర స్థాయిలో పోరాటం చేసిన బీజేపీ, అనంతరం సైతం ఏమాత్రం తగ్గకుండా అంతకంతకూ పెరుగుతున్న యమునా నది కాలుష్యం, పెరిగిన వాయు కాలుష్యం, తాగునీటి ఎద్దడి, ముంపు ప్రాంతాల్లో బాధితులకు అందని సహకారం వంటి అంశాలపై గడిచిన నాలుగు నెలలుగా తన పోరాటాన్ని ఉధృతం చేసింది. ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యంపై గడిచిన వారం రోజులుగా పోస్టర్ వార్‌తో పాటు వీధి పోరాటాలు చేస్తోంది. ఇక ఈడీ, సీబీఐ వంటి కేంద్ర సంస్థలను అడ్డుపెట్టుకొని బీజేపీ శిఖండి రాజకీయాలు చేస్తోందని ఆప్ ఎదురుదాడి చేస్తోంది. ప్రజా ప్రభుత్వానికి అధికారాలు ఇవ్వకుండా.. లెఫ్టినెంట్ గవర్నర్‌కు అసాధారాణ అధికారాలు కట్టబెట్టి, సమస్యలను జటిలం చేస్తోందని ఆప్ సైతం తీవ్ర స్థాయిలో స్పందిస్తోంది. ఈ పరిణామాలు ఓ పక్క జరుగుతున్న సమయంలోనే ఆప్ కీలక నేత, మాజీ మంత్రి కైలాశ గహ్లోత్ బీజేపీలో చేరారు. దీనికి బదులుగా బీజేపీ మాజీ ఎమ్మెల్యే అనిల్ ఝూని తన పార్టీలో చేర్చుకుంది ఆప్. ఈడీ కేసుల భయంతోనే గహ్లోత్ పార్టీ మారారని ఆప్ ఆరోపిస్తే, కేజ్రీవాల్‌కు రాజకీయ ఆశయాలు పెరగడం వల్లే ఆయన పార్టీ మారారని బీజేపీ ప్రత్యారోపణలకు దిగింది.

## మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశాం

అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశామని.. వారి స్థితిగతులను మెరుగుపరిచేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తు చేశారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని గంగపుత్రులందరికీ వైఎస్ జగన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు గురువారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'మత్స్యకారుల సంక్షేమం కోసం మన ప్రభుత్వంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. సముద్రంపై వేటకు వెళ్లే మత్స్యకారుల స్థితిగతులను మెరుగుపరచాలనే లక్ష్యంతో రూ.3,767.48 కోట్లతో 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. వేట నిషేధ సమయంలో దాదాపు 1,23,519 మత్స్యకార కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేశాం. సబ్సిడీపై డీజిల్ అందించాం. ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని గంగపుత్రులందరికీ మత్స్యకార దినోత్సవ శుభాకాంక్షలు' అంటూ వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

## విదేశీ విద్యకు సాయమందించండి

హైదరాబాద్: తమ పిల్లలు చదువుకునేందుకు విదేశాలకు వెళ్లారని, వారికి అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకం కింద సాయమందించాలని పలువురు తల్లిదండ్రులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. గురువారం గాంధీభవన్‌లో 'మంత్రితో ముఖాముఖి' కార్యక్రమం జరిగింది. దీనికి హాజరైన మల్లు భట్టి విక్రమార్కను సామాన్య ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున కలిసి తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. విదేశీ విద్యానిధి పథకం కింద పెద్ద చదువులు చదువుకునే విద్యార్థులకు ప్రజాప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పిన భట్టి.. వీలున్నంత త్వరగా ఆ నిధులు విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. ' తన తల్లి బ్రెస్ట్ కేన్సర్‌తో బాధపడుతున్నారని, ఆమె ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకునేందుకు అవసరమైన సాయం అందించాలని ముహేుశ్ కోరగా, భట్టి వెంటనే స్పందించి ఇప్పటివరకు అయిన ఆస్పత్రి బిల్లులకు ఎల్ఓసీ ఇప్పించాయిలని తన పీఏను ఆదేశించారు.

# విద్యార్థుల్లలో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు జెవివి చేస్తున్న కృషి అభినందనీయం

### ప్రధానోపాధ్యాయులు రాములు

### జన విజ్ఞాన వేదిక కీసర మండల స్థాయి పరీక్ష

### చెకుముకి సైన్స్ సంబురాలు - 2024



కాప్రా వార్త మిర్రర్ నవంబర్ 21:విద్యార్థుల్లలో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు జెవివి చేస్తున్న కృషి అభినందనీయమని నాగారం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు అన్నారు.గురువారం జన విజ్ఞాన వేదిక కీసర మండలం కమిటీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబురాలు -2024 భాగంగా మండల స్థాయి పరీక్ష నాగారం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు.పరీక్ష సంబంధించిన ప్రశ్న పత్రాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన నాగారం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక విద్యార్థులలో సృజనాత్మక శక్తిని పెంచే విధంగా ఇలాంటి పోటీ పరీక్షలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.అనంతరం పరీక్ష నిర్వహించారు.పరీక్ష అనంతరం జెవివి రాష్ట్ర నాయకులు,చెకుముకి కన్వీనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ పరీక్షల్లో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి వచ్చిన విద్యార్థులందరిని అభినందిస్తూ విజేతలందరికీ ప్రశంస పత్రాలను తన చేతుల మీదుగా అందజేశారు.పిల్లలు చదువుతోపాటు పెద్దలపట్ల గౌరవంతో ఉండి చెడు వ్యసనాలకు గురికాకుండా భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు.జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చిన ప్రతి ఒక్క విద్యార్థి విజేతలేనని తెలిపారు. వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులు,పాఠశాల యాజమాన్యాలు,ఉపాధ్యాయులు, పిల్లల విజయంలో భాగస్వాములేనని పేర్కొన్నారు.పిల్లల్లో నైపుణ్యతను పెంచడం కోసం ఇలాంటి పరీక్షలు బాగా ఉపయోగపడతాయని చెప్పారు.విద్యార్థులందరూ ఇలాంటి వాటిలో ముందుండి మంచి పేరు తీసుకోవాలని తెలిపారు.మండల స్థాయి లో రాణించి జిల్లా స్థాయి పరీక్ష కు అర్హత సాధించిన పాఠశాలకు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈనెల 28న జరిగే జిల్లాస్థాయి చెక్ ముకి పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎన్నిక కావాలని ఆకాంక్షించారు.విజేతలుగాజెవివి కీసర మండలం నాయకులు ఎం.ఎల్.చౌదరి మాట్లాడుతూ గత 34 సంవత్సరాలుగా జెవివి చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతంగా నిర్వహిస్తోందని తెలిపారు.విద్యార్థుల్లో సైన్స్ పట్ల మక్కువ పెంచడానికి తోడ్పడే విధంగా రూపొందించిన సైన్స్ సంబరాలను విద్యాశాఖ కూడా ప్రోత్సహిస్తూ ఉందని చెప్పారు.జిల్లా స్థాయికి ఎంపికైన పాఠశాలలు నాగారం సేరినిటీ స్కూల్ శివప్ప స్కూల్, దిశ స్కూల్, ప్రభుత్వ పాఠశాలల నుండి జెడ్ పి హెచ్ ఎస్ ఛీర్యాల, యాదిగిర్ పల్లి,దమ్మాయిగూడ,తెలుగు మీడియం జెడ్పిహెచ్ఎస్ నాగారం,రాంపల్లి,దమ్మాయిగూడ, రెసిడెన్షియల్ పాఠశాల నుండి జిల్లా స్థాయికి అర్హత సాధించాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ పాఠశాల ఉపాధ్యాయుల బృందంసభ్యులు వందన,సంతోషి,అరుణ,శైలజ, షభానా అజ్మీ,రామచంద్రయ్య,రమాదేవి,స్వప్న, శివలీల, ముహమ్మద్ అర్షద్ హుస్సేన్,మాధవి, పద్మావతి,దేవకీ,మానస జన విజ్ఞాన వేదిక కీసర మండలం నాయకులు పటేల్ నర్సింహులు,గుమ్మడి హరిప్రసాద్,వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నీకు చేతనైతే కొత్త పనులకు శంకుస్థాపన చెయ్

### పాత పనులకు కొబ్బరికాయ కొట్టడం సిగ్గుచేటు : ఎమ్మెల్యే కుంభం పై జనగాం పాండు ఫైర్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)

యాదాద్రి జిల్లా భువనగిరి పట్టణంలో మీడియా సమావేశంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు మాట్లాడుతూ భువనగిరి మండల పరిధిలోని చీమలకొండూర్ నుండి ముస్యలపల్లి వయా సికింద్ర నగర్ వరకు బండసోమారం నుండి వీరవెల్లి వరకు సురేపల్లి నుండి పచ్చర్లబొండు తండా వయా చందుగానితండా వరకు ఎర్రంబెల్లి నుండి కాంచనపల్లి వయా మాధవ నగర్ వరకు ఆ గ్రామాల్లో బీటీ రోడ్డు గత కాలంలో అధికారంలో వున్నా తమ ప్రభుత్వం మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి శంకుస్థాపన చేసిన పని ఎలక్షన్ కోడ్ వల్ల ఆగిపోయిందని తెలియజేస్తూ, ప్రారంభించిన పనులు మళ్లీ తిరిగి ఈరోజు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేయడాన్ని వారు ప్రశ్నించారు అంతేకాకుండా గతంలో ప్రారంభించిన పనులకు మళ్లీ శంకుస్థాపన చెయ్యడం ఫొటో పోజుల కోసం కాకుండా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. మాకు ఎమ్మెల్యే అంటే ఆ పదవి అంటే గౌరవం వుంది కానీ ఇలా చేసిన పనికి కొబ్బరికాయలు కొట్టి మేము ఏ పనులు ప్రారంభించాం అని గొప్పలు చెప్పుకొని ఆ పదవి పరువు తియ్యొద్దని వారు అన్నారు. ఈ 11 నెలలలో ఒక కొత్త పని అయిందా ఎమ్మెల్యే నువ్వు సంక్షేమం కోసం దృష్టి పెట్టు మహిళ లకు 2500 ఎట్టుపాయె, కళ్యాణి లక్ష్మి చెక్ తో పాటు తులం బంగారం ఎట్టుపాయ్యే అని ప్రశ్నించారు. నీకు చేతనైతే కొత్త పనులను మంజూరు చేయించి ఆపనులకు శంకుస్థాపన చెయ్ 11 నెలల కాలంలో ఇంత వరకు భువనగిరి మండలానికి రూపాయి బిల్లా మంజూరు కాలేదు. భువనగిరి మండలన్నిఅన్ని విధాలుగా సీసీరోడ్డు బీటి రోడ్డు అండర్ గ్రౌండ్ డ్రైనేజి బిల్డింగ్ పనులను ఆదర్శంగా తీర్చన ఘనత మా మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి దే అన్ని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసిలు సుబ్బూరు బీరు మల్లయ్య, సందెల సుధాకర్, మాజీ ఎంపీపీలు అతికం లక్ష్మీనారాయణ గౌడ్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ,కేశవపట్నం రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, బిఆర్ఎస్ పట్టణశాఖ అధ్యక్షులు ఏ వి కిరణ్, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ అబ్బగాని వెంకటేష్ గౌడ్, మాజీ రైతు సమన్వాయ అధ్యక్షుడు కంచి మల్లయ్య, మదర్ డైరీ డైరెక్టర్ కస్తూరి పాండు, బిఆర్ఎస్ నాయకులు ఈర్ల కృష్ణ, తోటకూర సురేష్ యాదవ్, సుబ్బూరి రమేష్, ర్యాకల నర్సింహా తదితరులు పాల్గొన్నారు

# అంగన్ వాడి సెంటర్, నర్సరీలను, వరి కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 21

గురువారం రోజున జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని మహితపూర్ అంగన్ వాడి సెంటర్ ను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు సంబంధించిన రిజిస్టర్ నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. 3-6 సంవత్సరాల వయస్సు గల పిల్లలు ఎంతమంది ఉన్నారు, వారు రోజు వస్తున్నారా అని వారి అటెండెన్స్ వివరాలను కలెక్టర్ అడగడం జరిగింది.. రోజు వారికి ఇచ్చే ఆహార మెనూను, వయస్సుకు తగ్గట్టుగా పొడవు, బరువు ఉన్నారా అని తెలుసుకున్నారు. పిల్లలకు పౌష్టిక ఆహారం మరియు బాలామృతం ఇస్తున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అంగన్ వాడి సెంటర్లో గర్భిణీలు, బాలింతలు ఎంతమంది ఉన్నారు, వారికి సంబంధించిన వివరాలను, వారికి పంపిణీ చేసే పౌష్టికహారం గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహితపూర్ గ్రామంలో నర్సరీ ని సందర్శించారు. ప్రజలకు ఉపయోగపడే పండ్ల మొక్కలు, పూల మొక్కలు పెంచాలని సూచించడం జరిగింది. మండలం లోని వీరపూర్ పాక్స్ వరి కొనుగోలు కేంద్రాన్ని, మరియు ఇటిక్యాల రామారావు పల్లె నూతనంగా నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలించారు.కలెక్టర్ వెంట, ఆర్డీవో మధు సుధన్ , ఈఈ ప్రేమ, అబ్దుల్ రహమాన్, ఎమ్మార్వో, ఎంపీడీవో, ఎంపీఓ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హా క్యా బాత్ హే.. ప్లాంటేషన్ తో గ్రామాలకు అందాలు

- చూడముచ్చటగా ఉన్న రోడ్డు ఇరుపక్కల పచ్చని చెట్లు
- ఉపాధి హామీ పథకం కింద రెండేళ్లు పాటు చెట్ల నిర్వహణ
- ఏపుగా ఎదిగిన చెట్లతో ప్రజలకు కనువిందు




కల్వకుర్తి నవంబర్ 21వార్త మిర్రర్ ప్రతినిధి:- ఉపాధి హామీ పథకం కింద నాటిన అవెన్యూ ప్లాంటేషన్ చెట్లు ఎపుగా పెరిగి ప్రజలను ఆకట్టుకుంటున్నాయి.కల్వకుర్తి మండలం జీడిపల్లి గ్రామ పంచాయతీ రహదారుల వెంట అవెన్యూ ప్లాంటేషన్ కింద రోడ్డుకు ఇరువైపుల వివిధ రకాల నీడనిచ్చే చెట్లను నాటారు. నాలుగు ఏళ్ల కింద నాటిన మొక్కలు ఏపుగా పెరిగి రోడ్డు వెంట వెళ్లే ప్రజలకు కనువిందు చేస్తున్నాయి.ఏ వీధిలో చూసిన పచ్చని పూల మొక్కలతో విరబూసిన పువ్వులు,చెట్లతో నిండిపోయింది. గ్రామస్తుల సహకారంతో గ్రామం మొత్తం హరితహారం గా మార్చారు. అటుగా వెళ్లేవారు చెట్టు ముందు నిలుచొని సెల్ఫీలు తీసుకుంటూ కాసేపు అక్కడే నిలుచొని ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు.కల్వకుర్తి మండలం లో 24 గ్రామ పంచాయతీల రహదారుల వెంట లక్షలు వెచ్చించి అవెన్యూ ప్లాంటేషన్ నాటారు. అయితే దాదాపుగా కొన్ని గ్రామపంచాయతీ రహదారుల వెంట నాలుగేళ్లుగా పెరిగిన మొక్కలు ప్రజలకు నీడ నివ్వడమే కాకుండా చూపరులను కనువిందు చేస్తూ ఉండడంతో రహదారుల వెంట వెళ్లి పాదాచారులకు కనువిందు చేయడంతో పాదాచారులు అవెన్యూ ప్లాంటేషన్ చెట్ల కిందట కూర్చొని సేదతీరుతున్నారు.రెండేళ్ల పాటు ఉపాధి హామీ పథకం కింద ఈ చెట్ల నిర్వహణ కోసం ఖర్చు చేసిన ప్రతిఫలం ఇప్పుడు కనిపిస్తుందని గ్రామంలోకి విచ్చేసిన వ్యక్తులకు స్వాగతం పలుకుతున్నట్లు రోడ్డుకి ఇరువైపులా చెట్లు హరిత తోరణంతో స్వాగతం పలుకుతున్నాయని పాదాచారులు, గ్రామస్తులు, తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. అన్ని గ్రామాలలో అవెన్యూ ప్లాంటేషన్ చేసినప్పటికీ కొన్ని గ్రామపంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వైఖరి వల్ల కొన్ని గ్రామపంచాయతీ రహదారుల వెంట అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు కనుమరుగవ్వడం విశేషం. తెలంగాణ ప్రభుత్వం అవెన్యూ ప్లాంటేషన్ పై ప్రత్యేక శ్రద్ధతో అధికారులను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని అధికార యంత్రంగా ఆదేశాలు జారీ చేసిన గ్రామపంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు,ససేమీరా అన్నట్లు వ్యవహరించడంతో కొన్ని గ్రామపంచాయతీ రహదారుల వెంట తూతూ మంత్రంగా ఉండడం సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. నాటిన మొక్కలు ఏపుగా పెరిగినప్పటికీ కొందరు రోడ్డు వెంట భూముల వారు ఇష్టానుసారంగా మొక్కలు కొట్టివేసిన దాఖలాలు ఉన్నాయి. అయినా ఏ ఒక్కరి పైన చర్యలు తీసుకోలేకపోయారు.గ్రామాల రహదారుల వెంట పచ్చదనంగా చెట్లు ఉన్నప్పటికీ ప్రత్యేక పాలన వల్ల ఉపాధి హామీ పథకం కింద వీటి నిర్వహణను మర్చిపోయారు.ప్రత్యేక పాలనతో గ్రామాలలో పారిశుద్ధ్యం లోపించినా పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తున్నారు .ప్రభుత్వాలు పాలకులు మారుతున్నప్పటికీ ప్లాంటేషన్ల పట్ల పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.అవెన్యూ ప్లాంటేషన్ ప్రజలను కనువిందు చేయడమే కాకుండా గ్రామం యొక్క అందాలను నిరూపించడం గమనార్హం అధికార యంత్రాంగం ప్రజాప్రతినిధులు అవెన్యూ ప్లాంటేషన్ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి తిరిగి వాటిని నాటించి గ్రామాలను ఆహ్లాదకరంగా ఉండే విధంగా చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# పిల్లలమర్రి రఘుపతి చేనేత రంగానికి తీరనిలోటు

### సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుకుపెల్లి సీతారాములు



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 21చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామనికి చెందిన పిల్లలమర్రి రఘుపతి మృతి చెందడం జరిగింది.ఆయన భౌతికాయానికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుకుపెల్లి సీతారాములు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం డి జాంగిర్ నివాళులు అర్పించారు. తదనంతరం మాట్లాడుతూ పిల్లలమర్రి యాదగిరి చేనేత రంగానికి అనేక సేవలు అందించాలని కొనియాడారు.ఆయన మృతి చేనేత రంగానికి తీరనిలోటని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, నాయకులు తడక మోహన్ బండారు నరసింహ, దబ్బటి బక్కయ్య, తడక రామాంజనేయులు, బత్తుల శంకర్,తడక చంద్రశేఖర్ పాల్గొన్నారు..



# కార్తీక మాసం సందర్భంగా యాదాద్రి కి పోటెత్తిన భక్తజనం

### పుష్కరిణిలో పుణ్య స్థానాలు- కార్తీక దీపారాధనలు- సత్యనారాయణ స్వామి వ్రతాలతో భక్తుల కోలాహలం

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఆలయ పరిసరాలు భక్తులతో కోలాహలంగా మారాయి. నరసింహుని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు భక్తులు. కార్తీక మాసం కావడంతో సత్యనారాయణ స్వామి వ్రత పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు కార్తీక మాసానికి యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఆలయ పరిసరాలు భక్తులతో కోలాహలంగా మారాయి. నరసింహుని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారుఅలాగే అనుబంధ ఆలయమైన శివాలయంలో పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని తరిస్తున్నారు. భక్తులు పుష్కరిణి లో పుణ్య స్నానాలు చేస్తున్నారు. కార్తీక దీపారాధనలు చేస్తున్నారు. దీంతో ఉచిత ప్రవేశ దర్శనానికి దాదాపు రెండు గంటల సమయం, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి దాదాపు గంట సమయం పడుతుంది. లడ్డు ప్రసాదం కౌంటర్లు, నిత్యా కళ్యాణం, కొండ క్రింద కల్యాణ కట్ట, పుష్కరిణి, సత్యనారాయణ స్వామి వ్రత మండపం, వాహనాల పార్కింగ్ వద్ద భక్తుల సందడి నెలకొంది.




# కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### వైద్యులు డాక్టర్ ఉదయ్ కుమార్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 21 లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు డాక్టర్ ఉదయ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ రేకుర్తి కంటి హాస్పిటల్ వైద్యులచే పట్టణంలోని బాలుర పాఠశాలలో చేపట్టిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 134 మందికి కంటి పరీక్షలు చేయగా 44 మందిని ఆపరేషన్ కోసం గుర్తించి రేకుర్తి కంటి హాస్పిటల్ కు వైద్యతో సహా తరలి వెళ్లారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ సుమారు 1983 మందికి కంటి ఆపరేషన్లతో పాటుగా మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మచ్చ శేఖర్, లయన్స్ క్లబ్ మాజీ డిసీ మ్యాకల రమేష్, రేకుర్తి హాస్పిటల్ వైద్యులు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేష్, కోశాధికారి కట్ల నర్సయ్య, ఉపాధ్యక్షులు కుర్మా సుదర్శన్ రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు ఎద్దండి దివాకర్, బొడుగం అంజిరెడ్డి, సాంబారు శ్రీనివాస్, ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ బెక్కెం తిరుపతి, ల్యాబ్ టెక్నీషియన్ మోసారపు సంతోష్, ప్రణయ్, యువకులు రాజేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

### సర్పంచ్ నుండి జడ్పిటిసి పదవి వరకు పోటీ చేయాలి..బిజెపి నాయకులు పి.కృష్ణారెడ్డి



కల్వకుర్తి నవంబర్ 21 వార్త మిర్రర్ ప్రతినిధి:- రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చూపించాలని బిజెపి నేత కృష్ణారెడ్డి అన్నారు.కల్వకుర్తి నియోజకవర్గం లో సర్పంచ్ నుండి జడ్పిటిసి వరకు అన్ని పదవులకు పోటీ చేయాలని కల్వకుర్తి మండల బిజెపి నాయకులు పి.కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ కి బలం చేకూర్చేందుకు ప్రతి పోలింగ్ బూత్‌లో మెజారిటీ సభ్యత్వాలు నమోదు చేయాలని,స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు సాధించేందుకు పార్టీ సభ్యత్వాన్ని మరింతగా పెంచాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్‌లో ఇద్దరు క్రియాశీల సభ్యులు ఉండాలని వాళ్ల ద్వారానే స్థానిక స్థాయిలో బీజేపీకి బలం చేకూరుతుందని చెప్పారు. క్రియాశీల సభ్యత్వం తీసుకున్న వారికి పార్టీ పదవులు గాని,స్థానిక సంస్థల ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వడం జరిగుతుందని గుర్తుచేశారు. బీజేపీ కార్యకర్తలు సభ్యత్వాన్ని విస్తృత స్థాయిలో ప్రోత్సహించాలని బిజెపి మండల నాయకులు పి కృష్ణారెడ్డి సూచించారు.



# పరిశుభ్రతపై విద్యార్థుల కు అవగాహన

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 21జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల యందు గురువారం రోజున ప్రభుత్వ వైద్యులు డాక్టర్ ఉదయ్ కిరణ్ విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను మరియు పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాల కృత్యముల తర్వాత మరియు భోజనానికి ముందు కాళ్లు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. వ్యాధిగ్రస్తులు అయినప్పుడు ఆంటీ బయోటిక్స్ ను డాక్టర్ సలహా ప్రకారం వాడాలని సూచించారు. సొంత వైద్యం చేసుకోకూడదని సూచించారు. సూక్ష్మజీవులు టాక్సిన్ ల బారిన పడకుండా రోగనిరోధక శక్తిని పెంచుకోవాలని సూచించారు. పంచదార ఆయిల్ ఫుడ్స్ ప్రాసెస్డ్ మాంసాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి విటమిన్లు పోషకాలు ఎక్కువగా ఉండే కూరగాయలను తినాలి అని విటమిన్ సి అధికంగా ఉండే నిమ్మకాయ ఆరెంజ్ లాంటి రసాలను తీసుకోవాలని ప్రతి రోజు ఒక కోడిగుడ్డును తినాలి అని విద్యార్థులకు సూచించారు. పరిసరాలు పరిశుభ్రత పై క్విజ్ ను నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ మోసరపు సంతోష్ డాటా కంప్యూటర్ ఆపరేటర్ పవన్ ఉపాధ్యాయులు పొన్నం రమేష్, రవీందర్, మల్లేశం, గంగా జమున, సత్యనారాయణ, నాగరాజు, తిరుమల గంగాధర్, వనిత, శివానందం, పారి పెల్లి గంగాధర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాధికార రిజర్వేషన్ల కోసం ముదిరాజులను బీసీ డీ గ్రూపు నుండి బిసి ఏ గ్రూపులోనికి మార్చుటకు నా వంతుచేస్తాను

### మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు పాశం సంజయ్ బాబు

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 21 ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ లక్కారం మత్స్యపారస్రామిక సహకార సంఘం భవనం వద్ద జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు పాశం సంజయ్ బాబు ఆధ్వర్యంలో జెండా ఎగరవేయడం జరిగింది. తనంతరం సంజయ్ బాబు ముదిరాజ్ మాట్లాడుతూ వెనుకబడిన ముదిరాజ్ జాతిని ముందుకు నడిపించడం కోసం యువతరాన్ని అభ్యుదయ మార్గంలోనికి తీసుకురావడం కోసం నిరంతరం పాటుపడతానని మత్స్యకారుల అభివృద్ధి కోసం ఎల్లవేళలా తోడ్పాటు అందించి విద్యా ఉద్యోగం మనకు రావలసిన న్యాయపరమైన హక్కుల కోసం రాజ్యాధికార రిజర్వేషన్ల కోసం ముదిరాజులను బీసీ డీ గ్రూపు నుండి బిసి ఏ గ్రూపులోనికి మార్చుటకు నా వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు పాశం కృష్ణయ్య ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పాశం రఘుపతి ముదిరాజ్,మాజీ కార్యదర్శి పాశం శ్రీనివాస్ ముదిరాజ్, డైరెక్టర్లు పాశం లింగస్వామి ముదిరాజ్,పాశం యుగంధర్ ముదిరాజ్, పాశం శ్రీను ముదిరాజ్, పాశం జంగయ్య ముదిరాజ్, పాశం రాజు ముదిరాజ్, సభ్యులు పాశం అంజయ్యముదిరాజ్,పాశంమహేష్ ముదిరాజ్, పాశం వెంకటేశంముదిరాజ్, జనమోని శ్రీను ముదిరాజ్, మన్యం శంకర్ ముదిరాజ్,పాశం రాజేష్ ముదిరాజ్, పాశం నరసింహ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు..



## అక్రమ వెంచర్లపై విచారణ చేపట్టాలి.

### - అధికారులకు వినతి పత్రం అందజేత

కల్వకుర్తి,నవంబర్ 21 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మండలం కుర్మిద్ద గ్రామ శివారులో సర్వే నెంబర్ 102,104లో అందాజ 2008,2009 మరియు 2010 సంవత్సరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం అడ్డదారిలో అక్రమ సంపాదన కొరకు చట్టాన్ని తుంగలో తొక్కి గవర్నమెంట్ నిబంధనలు పాటించకుండా,తమ ఇష్టానుసారంగా వెంచర్లు చేసి ప్రజలను మోసం చేయడానికి వెంచర్లు ఏర్పాటు చేయడం జరిగింది.అట్టి క్రమంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పడినా తరువాత ప్రభుత్వ అధికారులు సంబంధిత వెంచర్ల లో ప్లాట్ల రాళ్ళను తొలగించడం జరిగింది.అట్టి ప్లాట్లను కొనకుండా,అమ్మకుండా నిలిపివేయడం జరిగింది.అయితే ఈ మధ్య కాలంలో కొంతమంది రియల్ ఎస్టేట్ దారులు అక్రమ సంపాదనం కొరకు అడ్డదారుల్లో కుమ్మక్కై వెంచర్ ను చదును చేసి రాళ్లు పాతడం జరుగుతుందని కుర్మిద్ధ గ్రామస్తులు అధికారులకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.సంబంధిత వెంచర్ పై గతంలో గ్రామ పంచాయతీ ఆమోదం తో తీర్మానం చేసినారా? చేయలేదా? అప్పటి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నుండి నాలా పర్మిషన్ పొందారా? లేదా అని గ్రామ పంచాయతీ కార్యదర్శిని కోరగా ఏ మాత్రం పట్టించుకోవడంలేదని అందుకే ఎంపీడీవో,డి యల్ పీ ఓ,కి వినతి పత్రం అందజేయడం జరిగిందని కుర్మిద్ధ గ్రామస్తులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బిజెపి మండల నాయకులు పి. కృష్ణారెడ్డి,ఎస్.శ్రీధర్,బి. శివ, పి.హరీష్,బాలరాజ్ గౌడ్, కె.సాయిలు,పాల్గొన్నారు



## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విస్డం విద్యార్థులు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 21

జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెట్ పెల్లి మినీ స్టేడియం లో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ అండర్ 8/10/12 పోటీలలో విస్డం హై స్కూల్ రాయికల్ కి చెందిన విద్యార్థులు 50 మీ పరుగు పందెం మరియు స్టాండింగ్ బ్రాడ్ జంప్ లో బొమ్మేన లోకేశ్వర్ స్వర్ణం, రజతం, గడ్డం తన్మయ 50మీ మరియు 300 మీ పరుగు పందెం లో కాంస్యం ,చౌడారపు దేవాన్షి(స్టాండింగ్ బ్రాడ్ జంప్ లో కాంస్యం ), పెద్దిరెడ్డి హర్షిత్ రెడ్డి (50 మీ పరుగులో కాంస్యం )పతకాలు కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి, విజ్డం హై స్కూల్ ప్రిన్సిపాల్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి ప్రెస్ క్లబ్ జేఏసీ ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీశ్వర్ అభినందించి మెడల్స్ సర్టిఫికెట్లు అందజేశారు.



## శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానం,లో హుండీ లెక్కింపు.

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 21

చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం లో శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానం,హుండీ లెక్కింపు గురువారం రోజున లెక్కించగా 4 నెలల 20 రోజులకు గాను 14, 96,475 రూపాయలు రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ పర్యవేక్షకులు కే ఏడుకొండలు,సల్వాది మోహన్ బాబు, కార్యనిర్వాణాధికారి ,సత్తిరెడ్డి జూనియర్ అసిస్టెంట్, అర్చకులు శివప్రసాద్ శర్మ, సేవా సమితి వారు , సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు

# పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రిన్సిపాల్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 21

కణజాల వర్ధన పుస్తకావిష్కరణ గావించిన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జగిత్యాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి జగిత్యాల వృక్ష శాస్త్ర విభాగ విభాగ పూర్వ సహాయ ఆచార్యులు డాక్టర్ పడాల తిరుపతి కణజాల వర్ధనం పై రచించిన ఎన్ ఓవర్ వ్యూ టు ద ఫీల్డ్ ఆఫ్ ప్లాంట్ టిష్యూ కల్చర్ అనే పుస్తకం గురువారం రోజున ప్రిన్సిపల్ ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కల్వకుంట్ల రామకృష్ణ మాట్లాడుతూ కణజాల వర్ధనం పై రచించిన ఈ పుస్తకం విస్తృతమైన విశ్లేషణతో, నూతన సాంకేతిక ప్రక్రియలతో కూడి ఉన్నదని పేర్కొన్నారు. ఈ పుస్తకం ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న ఆరవ సెమిస్టర్ విద్యార్థులకు మరియు పీజీ బొటని మొదటి మరియు ద్వితీయ సంవత్సర విద్యార్థులతో పాటుగా, పరిశోధన విద్యార్థులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని, అంతర్జాతీయ స్థాయిలో అమెజాన్ ఆన్లైన్ లో అందుబాటులో ఉన్నదని, దీనిని వృక్ష శాస్త్ర అభిలాషకులు, అధ్యాపకులు, విద్యార్థులు వినియోగించుకోవాలని, దీని రచనకు పట్టిన కాలం రెండున్నర సంవత్సరాలని, గతంలో ఇది కళాశాలలో పనిచేస్తుండగా మూడు అత్యంత ఉన్నతమైన పుస్తకాలు డిగ్రీ మరియు పీజీ విద్యార్థుల కోసం రచించారని, ఇదే కళాశాలలో అనేకమైన జాతీయస్థాయిలో ఆన్లైన్ సెమినార్స్, ఆన్లైన్ లైన్లో వృక్ష శాస్త్రంలో పీజీ ఎంట్రన్స్ కోసం ఉచిత కోచింగ్ ఇస్తూ విద్యార్థులకు ఉన్నతమైన విద్యాభ్యాసంలో తోడ్పడ్డారని గుర్తు చేస్తూ



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పూర్వ అధ్యాపకుడిగా పనిచేసిన డాక్టర్ పడాల తిరుపతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి చంద్రయ్య, డాక్టర్ డి సుజాత, బి నరేష్, కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎం ఏ రహీం, డాక్టర్ ప్రమోద్ కుమార్, డాక్టర్ వాసాల వరప్రసాద్, రసాయన శాస్త్ర అధ్యాపకురాలు నీలి వాసవి, భౌతిక శాస్త్ర అధ్యాపకుడు రామచంద్రం, జంతు శాస్త్ర విభాగ సహాయ ఆచార్యులు డాక్టర్ నీరజ, డాక్టర్ సంగీత రాణి, అర్థశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ బి జమున, డాక్టర్ జి శ్రీలత, డాక్టర్ సాసాల మల్లికార్జున్ తదితర అధ్యాపకులు పాల్గొని డాక్టర్ పడాల తిరుపతిని అభినందిస్తూ మరిన్ని పుస్తకాలు వృక్షశాస్త్రంపై తీసుకురావాలని అభిలాషించారు.

# ఆకాశమే హద్దుగా యువతకు అవకాశాలు: మంత్రి శ్రీధర్ బాబు

### రఘువంశీ ఏరోస్పేస్ యూనిట్ తయారీ కేంద్రానికి శంకుస్థాపన

### మహేశ్వరం నియోజకవర్గం మామిడిపల్లి హార్డ్ వేర్ పార్క్ లో వేలాదిమందికి ఉద్యోగాలు

వార్త మిర్రర్ ( రంగారెడ్డి జిల్లా ప్రతినిధి.. ధనుంజయ్ నేత ) .. నవంబర్ 21 ==గత దశాబ్దన్నర కాలంలో ఏరోస్పేస్ లో అపారమైన అవకాశాలు వచ్చాయని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు గురువారంమహేశ్వరం నియోజకవర్గం మామిడిపల్లి గ్రామంలోని హార్డ్ వేర్ పార్క్ లో రఘువంశీ ఏరోస్పేస్ తయారీ యూనిట్ కేంద్రానికి శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆకాశమే హద్దుగా యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు డిఫెన్స్, వైమానిక రంగాల్లో ఎదిగేందుకు అవకాశం ఉందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. అనంతరం మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పాల్గొని మాట్లాడుతూ... మహేశ్వరం నియోజకవర్గంలో హార్డ్ వేర్ పార్క్, ఫ్యాబ్ సిటీ, ఫోర్త్ సిటీ అనేక అంతర్జాతీయ కంపెనీలు ఉన్నాయని.. అందువల్ల స్థానిక యువతీయువకులకు బోలెడన్నీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు.కంపెలకు తగినట్లు స్కిల్స్ డెవలప్మెంట్ చేసుకోవాలని సూచించారు రఘువంశీ ఏరోస్పేస్ ను 20 ఏళ్ల క్రితం 10 మంది ఉద్యోగులతో తన తండ్రి ప్రారంభించారని.. నేడు 2000 మందికి ఉపాధి కల్పించే సంస్థగా ఎదగటం గర్వంగా ఉందని



ఛైర్మన్ రఘువంశీ అన్నారు.ఈ కార్యక్రమంలో టి ఎస్ ఐ సి ఎండి విష్ణువర్ధన్ రెడ్డి, ఏరోస్పేస్ డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్, డి ఆర్ డి ఓ శాస్త్రవేత్త యు. రాజబాబు, భారత్ బయోటిక్ సిఐ ఈ డి ఛైర్మన్ సాయి ప్రసాద్ సహా కాంగ్రెస్ నాయకులు ఏనుగు జంగారెడ్డి, కృష్ణానాయక్, మదన్ పాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఆదిళ్ల జంగయ్య, భాస్కర్ రెడ్డి, కంపెల ప్రతినిధులు పాల్గొన్నారు.



## జగిత్యాలలో పేలిన టీవీఎస్ ఎలక్ట్రిక్ స్కూటీ.. కొని మూడు నెలలే

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 21

జగిత్యాల రూరల్ మండలం బాలపెల్లి గ్రామంలో ఎలక్ట్రిక్ స్కూటర్ బ్యాటరీ పేలింది. బాలపల్లికి చెందిన భేతి తిరుపతి రెడ్డి మూడు నెలల క్రితం టీవీఎస్ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ స్కూటీ కొనుగోలు చేశాడు. రోజూలానే ఇవాళ ఉదయం(గురువారం, నవంబర్ 21) తన ఇంటి కాంపౌండ్ లోపల ఎప్పటి లానే స్కూటర్కు చార్జింగ్ పెట్టి వేరే పనుల్లో నిమగ్నమయ్యాడు. స్కూటీకి చార్జింగ్ పెట్టిన కొద్దిసేపటికి బ్యాటరీ పేలి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ప్రమాదంలో ఇంటి తలుపులు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. స్కూటీ పూర్తిగా కాలిపోయింది. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో మంటలను అదుపులో తెచ్చారు.తెలంగాణ ప్రభుత్వం కాలుష్యాన్ని తగ్గించే సదుద్దేశంతో ఎలక్ట్రిక్ వాహనాలను కొనాలని పిలుపునిస్తున్న సమయంలో ఇలా ఎలక్ట్రిక్ స్కూటీలు పేలిపోతున్న ఘటన వెలుగులోకి రావడం ఆందోళన కలిగించే విషయం. లీటర్ పెట్రోల్ ధర 110 రూపాయలకు పైగానే ఉన్న ఈరోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు వైపు వాహన దారులు మొగ్గుచూపు తున్నారు. కానీ..ఇలా అడపాదడపా ఎలక్ట్రిక్ స్కూటర్లు పేలిపోతున్న ఘటనలు కొనుగోలుదారులను ఆలోచనలో పడేస్తున్నాయి.



## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ప్రోద్బలంతోనే కామినేని చౌరస్తాలో వైయస్సార్ దిమ్మెను కూల్చివేసిన అధికారులు, కాంట్రాక్టర్

### దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ విగ్రహ దిమ్మె కూల్చివేతపై టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం

ఎల్. బి నగర్, 21 నవంబర్ :కామినేని చౌరస్తా వద్ద ఉన్న వైయస్సార్ విగ్రహ దిమ్మెని అభివృద్ధి పేరిట కూల్చడం పై టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి కామినేని చౌరస్తా వద్దకి తరలివచ్చి నిర్మాణ పనులను పరిశీలించి దిమ్మెను కూల్చివేసిన కాంట్రాక్టర్ ని నిలదీశారు.ఈ సందర్భంగా జక్కిడి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూఎల్. బి నగర్ మ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ ప్రోత్బలంతోనే అధికారులు, కాంట్రాక్టర్లు వైయస్సార్ విగ్రహ దిమ్మెను కూల్చివేశారని, వెంటనే అధికారులు స్పందించి వైయస్సార్ విగ్రహాన్ని పునర్నిర్మించిన తర్వాతనే కాంట్రాక్ట్ పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. అవినీతి ఆర్థిక నేరగాడైన స్థానిక ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి వైయస్సార్ విగ్రహాన్ని ఎప్పటి నుండో తొలగించ డానికి ప్రయత్నిస్తున్నాడని ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మరియు జిహెచ్ఎంసి అధికారులు, కాంట్రాక్టర్లు వైయస్సార్విగ్రహం విషయంలో జోక్యం చేసుకుంటే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి ఎర్రంబెల్లి సతీష్ రెడ్డి, సీనియర్ నాయకులు జోగు రాములు, జైపాల్ రెడ్డి, యాదగిరి, అక్రమ్, శ్యామల రెడ్డి, పృధ్వీరాజ్, ఇరిగి రమేష్, సుక్క వెంకట్ , స్వామి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం లో అయ్యప్ప దీక్ష మలధారణ స్వాముల నిత్య అన్నదానం

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 21

చౌటుప్పల్ శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం లో అయ్యప్ప దీక్ష మలధారణ స్వాముల నిత్య అన్నదానం కార్యక్రమం లో 1వ రోజు శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం లో అన్నదానం కార్యక్రమం నిర్వహించిన మొగుదాల రమేష్ గౌడ్ సాహితీ దంపతులు అన్నదానం నిర్వహించడం జరిగింది. వారి కుటుంబానికి ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు ప్రసాదిం చాలని అయ్యప్పస్వామి ని మనసారా కోరుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో బత్తుల విప్లవ్ గౌడ్,అన్నదానం నిర్వకులు తూర్పునూరి నర్సిహ్మా గౌడ్,సన్నిధానం గురుస్వాములు చెవగొని మహేష్ గౌడ్,ఐతగొని శ్రీను,బత్తుల మల్లేష్ గౌడ్, రాజు, మరగొని గణేష్ గౌడ్, ఉప్పునూతల నర్సింహ, మేకల అనిల్, సన్నిధానం స్వాములు మీసాల శ్రీకాంత్,జగన్,మార్గం శేఖర్,సప్పిడి శేఖర్ రెడ్డి, చెవగోని శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు..




## సిపిఎం 21వ నల్లగొండ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

### సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య

కొండ మల్లేపల్లి నవంబర్ 21 వార్త మిర్రర్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే సిపిఐ(ఎం) నల్గొండ జిల్లా 21వ మహాసభలు డిసెంబర్ 2,3,4 తేదీల్లో మిర్యాలగూడలో జరగనున్నాయని ఆ మహాసభల జయప్రదానికి ప్రజలందరూ సహకరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య పిలుపునిచ్చారు.గురువారం నాడు సిపిఎం కొండ మల్లెపల్లి మండల మూడో మహాసభ మండల కేంద్రంలో జరిగింది మహాసభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ 2న భారీ బహిరంగ సభ ఎర్ర చొక్కాలు చీరలతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని 3,4 తేదీల్లో జరిగే మహాసభల్లో జిల్లాలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమం రూపొందిస్తామని అన్నారు.మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్ డిఎ నాయకత్వంలోని మోడీ సర్కార్ ప్రైవేటీకరణ మతోన్మాద విధానాల్ని మరింత ముందుకు తీసుకుపోతుందని విమర్శించారు. అందులో భాగంగానే ప్రభుత్వ రంగ సంస్థలను స్వదేశీ విదేశీ కార్పొరేట్ శక్తులకు దారా దత్తం చేస్తుందని విమర్శించారు.అనేక వాగ్దానాలు చేసే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని విస్మరించి మాటలతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఆందోళన పోరాట కార్యాచరణను ఈ మహాసభల్లో రూపొందిస్తామని తెలియజేశారు .ఈ మహాసభల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చిన్నపాక లక్ష్మీనారాయణ జిల్లా కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ మండల కార్యదర్శి రమావతు లక్ష్మణ్ నాయక్ నాయకులుసుజాతశ్రీనివాసు.సత్యనారాయణ చారి .వెంకటయ్య.యాదగిరి, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు

# రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు నీకు లేదు

## - రైతులను బోల్తా కొట్టింది బిఆర్ఎస్..బోనస్ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం



కల్వకుర్తి నవంబర్ 21 వార్త మిర్రర్ ప్రతినిధి:-హరీష్ రావు కురుమూర్తి పర్యటన సందర్భంగా పలువురు బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ పై సిగ్గు లేకుండా అభాండాలు వేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితి విజయ్ కుమార్ రెడ్డి అన్నారు.రైతులకు రుణమాఫీ చేస్తామని పదేళ్ల పాటు కాలయాపన చేసి అన్నదాతలను నిలువునా మోసం చేసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు రుణమాఫీ పై మాట్లాడడం హాస్యాస్పదం అయ్యా హరీష్ రావు మీ మామ రైతులకు రుణమాఫీ చేస్తానని విడతలు, విడతలుగా రుణాలు మాఫీ చేస్తే అవి రైతులకు వడ్డీలకే సరిపోలేదు,కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసింది, కానీ అక్కడక్కడ సాంకేతిక కారణాలతో మరియు రెండు లక్షలోపు రుణాలు మాఫీ కానీ రైతులకు సైతం డిసెంబర్ లోగా రుణమాఫీ చేస్తామని ఇప్పటికే ప్రకటించాము అయినా సిగ్గు లేకుండా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అవ్వడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు.నీ పర్యటన సందర్భంగా మీ పార్టీ మాజీ ఎమ్మెల్యే సెల్విడి వద్ద నలుగురు బిఆర్ఎస్ కార్యకర్తలను వడ్ల కుప్పల వద్ద పెట్టి వారిచేత కాంగ్రెస్ ప్రభుత్వం పై తప్పుడు ఆరోపణలు చేయించావు మొన్న లగచర్ల లో కూడా ఇదే తరహా కుట్రలు చేసి రాష్ట్రంలో అరాచకాలకు తెరలేపారు.మీ అరాచకాలను దీటుగా ఎదుర్కొంటాం మీకు సరైన సమయంలో ప్రజలు మరోసారి బుద్ధి చెబుతారు.ఓడిపోయిన నలుగురు మాజీ ఎమ్మెల్యేలను వెంటబెట్టుకుని తప్పుడు ప్రచారాలు,తమాషాలు చేస్తే మా పాలమూరు ప్రజలు చూస్తూ ఊరుకోరు హరీష్ రావు. అని కాయితి విజయ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను రూ"7 లక్షల 12 వేల కోట్ల అప్పు చేసి అప్పుల ఊబిలోకి నెట్టిన,ఆర్థిక వ్యవస్థను చక్క దిద్దుకుంటూ ఇచ్చిన మాట మేరకు, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వం పై కుట్రపూరితంగా అసత్య ఆరోపణలు చేయడం హరీశ్ రావు నీ దివాలాకోరు తనానికి నిదర్శనం అని ఇలాగే మాట్లాడితే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్తారని తెలియజేశారు.



## శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు చిన్న జీయర్ స్వామికి ఆహ్వానం

వార్త మిర్రర్ ( రంగారెడ్డి జిల్లా ప్రతినిధి.. ధనుంజయ్ నేత ) .. నవంబర్ 21 ==

గురువారం శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామికి శ్రీ పద్మావతి గోదా సమేతశ్రీ వెంకటేశ్వర స్వామి వారి16 వార్షిక బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగింది ఈ కార్యక్రమం లో అమీర్పేట్ గ్రామస్తులు మహేశ్వరం మండలం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య ,అమీర్పేట్ గ్రామ మాజీ సర్పంచ్ బస్వా శ్రీశైలం గౌడ్ మాజీ ఎంపిటిసి కుమారి రాయప్ప మాజీ వార్డ్ మెంబర్స్ సభ్యులు సంభ మల్లేష్ అమీర్పేట్, గ్రామ వెంకటేశ్వర స్వామి దేవాలయం కమిటీ అధ్యక్షులు ఆవుల రమేష్ , గ్రామ శాఖ అధ్యక్షులు, హైతాబాద్ రాజేందర్ అమీర్పేట్ గ్రామ మాజీ వార్డ్ మెంబర్ సభ్యులు కడల భాస్కర్ ఎర్ర ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

## సయ్యద్ ఏజాస్ ఆకస్మిక మరణం కుటుంబానికి తీరని లోటు దేవరకొండ మాజీ శాసన సభ్యులు రవీంద్ర కుమార్



దేవరకొండ నవంబర్ 21 వార్త మిర్రర్ :దేవరకొండ పట్టణంలోని చిన్న దర్గా ముతవల్లి సయ్యద్ ఏజాస్ ఆకస్మిక మరణం కుటుంబానికి తీరని లోటు అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.గురువారం నాడు వారి బౌతికాయనికి నివాళులర్పించారు.అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .....అనంతరం ఏజాస్ కుటుంబ సబ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఏజాస్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు మహ్మద్ ఖాదర్ బాబా, మహ్మద్ అఫ్రోజ్,బిఆర్ఎస్ కొండమల్లెపల్లి యువజన విభాగం అధ్యక్షుడు రమావత్ తులిసిరామ్,మహ్మద్ బాబా, తదితరులు ఉన్నారు.



## శివాని శేషు ముదిరాజ్ ల వివాహ వేడుకలో పాల్గొన..పారిజాత నర్సింహారెడ్డి

వార్త మిర్రర్ ( రంగారెడ్డి జిల్లా ప్రతినిధి.. ధనుంజయ్ నేత ) .. నవంబర్ 21 ==

శంషాబాద్ లోని మల్లికా కన్వెన్షన్ హాల్ లో మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్ కుమార్తె శివాని శేషు ముదిరాజ్ ల వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి



## ఏసీపీ జైపాల్ రెడ్డి ని కలిసిన బిజెపి శ్రేణులు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ నవంబర్ 21.... ఏసిపి జైపాల్ రెడ్డిని వారసిగూడ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ హెచ్ ఓ ఆర్. సైదులు దిశా కమిటీ మెంబర్, బిజెపి స్పోక్స్ పర్సన్ శారదా మల్లేష్ శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభు గుప్తా, బిజెపి జిల్లా కార్యదర్శి మల్లికంటి వీరన్న, శ్యాంసుందర్, నీలం శ్రీనివాస్, బిక్షపతి, శ్రీనివాస్ చారి, వేణు, బిజెపి సీనియర్ నాయకులు మహేష్, రవి, నరసింహ, రామకృష్ణ, బౌద్ధ నగర్ డివిజన్ ప్రెసిడెంట్ హనుమంతు అనేకమంది బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ ముత్యాలమ్మ దేవాలయ నిర్మాణానికి భూమి పూజ

## ధర్మానాయక్ తండాలో హెూమం నిర్వహించిన గ్రామస్తులు

చందంపేట నవంబర్ 21 వార్త మిర్రర్ ::చందంపేట మండలం గన్నేర్లపల్లి గ్రామపంచాయతీ ధర్మ నాయక్ తండాలో గురువారం నాడు ధర్మానాయక్ తండ కమ్యూనిటీ కల్చరల్ డెవలప్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తండాలో శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయ నూతనంగా నిర్మించబోయే దేవాలయానికి గ్రామ పెద్దలు సమక్షంలో భూమి పూజను నిర్వహించారు. అనంతరం తండాలో కలశ పూజ విఘ్నేశ్వరుని పూజ నిర్వహించిన అనంతరం ఆలయ నిర్మాణం సజావుగా జరగాలని తండ పెద్దలు హెూమాన్ని నిర్వహించారు. అనంతరం తండాలో అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు చందంపేట మాజీ ఎంపీపీ పార్వతీ చందు నాయక్,మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య,పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం యాదవ్,దేవరకొండ ఎల్ఐసి సీనియర్ బ్రాంచ్ మేనేజర్



ఎస్.రాము చౌహాన్,చైర్మన్ రామావత్ లాలూ నాయక్ వైస్ చైర్మన్ దశరథ్ జనరల్ సెక్రెటరీ రాజు ట్రెజరీ రవీందర్ జాయింట్ సెక్రెటరీ తిరుపతి ఆర్గనైజేషన్ సెక్రటరీ మంగులాల్ పబ్లిసిటీ సెక్రెటరీ హనుమంతు, గోపీ ,సెక్రటరీలు విష్ణు లక్ష్మణ్ కమిటీ సభ్యులు రామావత్ రాము పాండు,లక్ష్మణ్,శివ,కోటి, వెంకటి, బాబులాల్ గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం జగన్ పథకాలకు కూటమి తూట్లు

విశాఖపట్నం వార్త మిర్రర్ ఏపీ బడ్జెట్‌లో మత్స్యకారులకు మొండి చెయ్యేమాజీ సీఎం జగన్ పథకాలకు కూటమి తూట్లుమత్సకార దినోత్సవం సందర్భంగా వాసుపల్లి ఆగ్రహంమాజీ సీఎం జగన్ పథకాలకు కూటమి తూట్లుభారీ చేపను బహూకరించిన దక్షణ వైసీపీ శ్రేణులు విశాఖపట్నం: ఏపీ ప్రభుత్వం ఇటీవల అమల్లోకి తెచ్చిన బడ్జెట్‌లో మత్స్యకారులకు మొండి చేయ్యే చూపించిందని, విశాఖ దక్షిణ మాజీ ఎమ్మెల్యే, ఆ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వాసుపల్లి గణేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మత్స్కకార దినోత్సవం సందర్భంగా ఆశీలుమెట్ట కార్యాలయంలో గురువారం తనను కలిసిన గంగపుత్రులతో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్ జాలర్ల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని, విశాఖ మత్స్యకారుల్ని అన్ని విధాలా ఆదుకున్నారని గుర్తు చేశారు. ఫిషింగ్ హార్బల్‌లో ప్రమాదం చోటు చేసుకుంటే ఆఘమేఘాలపై జగన్ స్పందించి, భారీ స్థాయిలో పరిహారం ప్రకటించారని గుర్తు చేశారు. వైసీపీ పథకాలకూ ఈ కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని మండిపడ్డారు. చంద్రబాబుకు మత్స్యకారులంటే ఇంకా చిన్న చూపేనని, బడ్జెట్ కేటాయింపులో వారికి చోటు లేకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ఎన్నికల ముందు వారిని మభ్యపెట్టి ఇచ్చిన హామీల్ని చంద్రబాబు గంగలో కలిపేశారని, 100కి.మీకి ఒక జెట్టీ నిర్మిస్తామని చెప్పి గతంలో కూడా మోసం చేశారన్నారు. ప్రభుత్వాలే కృషి చేయాలిమత్స్యకారుల జీవన ప్రమాణాల్ని పెంచేందుకు ప్రభుత్వాలే కృషి చేయాలని, నడి సంద్రంలో ప్రాణాలకు తెగించి వేట సాగిస్తున్న జాలర్ల సంక్షేమానికి ఈ ప్రభుత్వం కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా వాసుపల్లిని స్థానిక వైసీపీ నేతలు కలిసి భారీ చేపను బహూకరించి, దుశ్శాలువాతో సత్కరించారు. వారందరికీ వాసుపల్లి శు



భాకాంక్షలు తెలిపారు. ప్రజా దర్బార్ నిర్వహించి మత్స్యకారులకు అనేక సేవలందించామన్నారు. కార్యక్రమంలో 29వ వార్డు అధ్యక్షులు పీతల వాసు, వేణు, దశమంతుల మాణిక్యాలరావు, తాడి రవితేజ, 31వ వార్డు అధ్యక్షులు బాబు ఆనంద్, 33వ వార్డు అధ్యక్షులు ముత్తాబత్తుల రమేష్, సూర్య, లింగం శ్రీను, దుర్గారావు, నర్సింగరావు, వెంకటేష్, లక్ష్మణ్, కట్టుముచ్చు సాగర్, శ్రీశ్రీ జగన్నాథ స్వామి ఆలయ ధర్మకర్త, అది కనగల రామరాజు, మైలిపిల్లి మాసేను, గనగల్ల గరకయ్య, బొడ్డ ఆనంద్, గనగల రాజేష్, వాసుపల్లి రాజు, రాష్ట్ర కాళింగుల మాజీ డైరెక్టర్ సనపల రవీంద్ర, దక్షిణ నియోజకవర్గం మైనార్టీ అధ్యక్షుడు ముజీబ్ షకీల్, ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ లండ రమణతో పాటు స్థానిక వైసీపీ నేతలు పాల్గొన్నారు.

## ఈ నెల 23న జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ....మారెడ్ పల్లి తహసిల్దార్ భీమయ్య గౌడ్



సికింద్రాబాద్, వార్తా మిర్రర్ నవంబర్ 21 : ఈ నెల 23వ తేదిన హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బిసీ కమీషన్ చైర్మన్ గోపి శెట్టి నిరంజన్ ఆద్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మారెడ్ పల్లి తహసిల్దార్ భీమయ్య గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు తహసిల్దార్ భీమయ్య గౌడ్ తార్నాకలో గురువారం మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బిసీ రిజర్వేషన్ల పెంపుపై జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా వెనెకబడిన తరగతుల స్థితిగతుల అధ్యయనంలో భాగంగా బహిరంగ విచారణ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు తమ అభిప్రాయాలు, సలహాలు సూచనలను అందజేయవచ్చన్నారు.



## విశాలాంధ్ర పుస్తక మహెూత్సవం ను తిలకించిన మాజీ మంత్రి దాడి వీరభద్ర రావు

విశాఖపట్నం వార్త మిర్రర్ ఇరవై మూడవ విశాలాంధ్ర పుస్తక మహెూత్సవం ను ఈరోజు మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సందర్శించారు అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తక ప్రియులకోసం అన్నిరకాల పుస్తకాలను ఒకే చోట దొరికేలా ఎర్పాటు చేస్తూ ప్రజాదరణ పొందుతున్న విశాలాంధ్ర సిబ్బందిని అభినందించారు భారత దేశంలో రోజు రోజుకు పుస్తక పఠనం పెరుగుతుందని డిజిటల్ యుగంలో కూడా పుస్తకలవైపు ఆసక్తి చూపుతున్న పాఠకులకు అభినందనలు తెలిపారు ప్రతి ఒక్కరూ రోజులో ఒక గంటైన పుస్తకాలు చదివితే జ్ఞానం విజ్ఞానం వివేకం అలవరచుకోవచ్చని ప్రతిఒక్కరూ విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనను తిలకించి వారి భవిష్యత్తుకు దోహదపడే పుస్తకాలను పొందలని ఆయన అన్నారు ఈ పుస్తక ప్రదర్శన నేటితరం యువతకు ఎంతో దోహదపడుతుందన్నారు అనంతరం వివిధరకాల పుస్తకాలను ఆయన తిలకించారు



## ఉస్మానియా యూనివర్సిటీలో డిసెంబర్ 18, 21 తేదీల్లో జరిగే కాంగ్రెస్ విద్యార్థి నిరుద్యోగ సభను కచ్చితంగా అడ్డుకుంటాం...బీఆర్ఎస్వీ

సికింద్రాబాద్, వార్త మిర్రర్ నవంబర్ 21..... ఉస్మానియా యూనివర్సిటీలో కాంగ్రెస్ నాయకులు తలపెట్టిన సభను అడ్డుకుంటామని బీఆర్ఎస్వీ నేతలు హెచ్చరించారు. ఈ మేరకు ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో గురువారం బీఆర్ఎస్వి నాయకులు మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలన్నారు.మొదటి ఏడాదిలోనే రూ.2 లక్షల ప్రభుత్వాల ఉద్యోగాలు ,కల్పించలేదన్నారు. రూ. 4000 నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, ప్రతి విద్యార్థికి 5 లక్షల విద్యా భరోసా కార్డు లేదు, విద్యారంగానికి బడ్జెట్లో ప్రస్తుత వాటా 6 నుండి 15 శాతానికి పెంపు విశ్వవిద్యాలయాల్లో రీసెర్చ్ స్కాలర్స్ కి నెలకు 10,000 ఫెలోషిప్ లేదన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఈడబ్ల్యూఎస్ వర్గాల విద్యార్థులందరికీ ఫీజు రివైర్మెంట్ తో పాటు పాత బకాయిలు పూర్తిగా చెల్లింపు లేదన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో 1250 మందికి 350 మంది శాశ్వత ఆచార్యులు ఉన్నారు , ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండ విద్యారంగములో ఇన్ని సమస్యలు పెట్టుకొని ,డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న ముఖ్యమంత్రి. నిరుద్యోగా సమాజానికి వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. గదరాజు చందు డిమాండ్ చేసారు. ఈ కార్యకమ%శీ%లో బీఆర్ఎస్వి కార్యదర్శి జీడీ అనిల్ ,ఓయూ బీఆర్ఎస్వి నాయకులు జంగయ్య ,క్యాదాసి రవి,కొంపెల్లి నరేష్ ,మిథున్ ప్రసాద్ ,శ్రీకాంత్ ,నాగేందర్ ,పవన్ కుమార్ ,అవినాష్ ,సాయి ,జాషువా ,తదితరులు పాల్గొన్నారు.



## అకారణంగా అర్ధరాత్రి వాహనాలపై తిరుగుతున్న వారిపై కఠిన చర్యలు

మిర్యాలగూడ నవంబర్ 21:-( వార్త మిర్రర్)ఆపరేషన్ చెబుత్రలో భాగంగా మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజా శేఖర్ రాజు ఆదేశాల మేరకు బుధవారం అర్ధరాత్రి మిర్యాలగూడ పట్టణంలో పలు ప్రదేశాలలో అకస్మాత్తుగా పోలీసులు చేశారు. తనిఖీలలో కారణం లేకుండా ఆకారణంగా రోడ్లపై తిరుగుతున్న 26 వాహనాలను, 32 మంది వ్యక్తులను పట్టుకుని పోలీసు స్టేషన్ కు తీసుకొని వచ్చారు. వాహనాల డాక్యుమెంట్స్ పరిశీలించి సరైనా పత్రాలు లేని వాహనాలపై చట్టపరమైన చర్య తీసుకోవడం జరుగుతందన్నారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి మరొకసారి అర్ధరాత్రి రోడ్డుపై కనిపిస్తే కేసులు తప్పవని బైండోవర్లు చేస్తామని గట్టిగా హెచ్చరించి పంపించామని తెలిపారు. ఆపరేషన్ లో మిర్యాలగూడ ఓన్, టూ టౌన్ ఇన్స్పెక్టర్లు కోట కరుణాకర్, పి.నాగార్జున, సబ్ ఇన్స్పెక్టర్లు బి.సుధీర్ కుమార్, బి.రాంబాబు, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



## నల్ల బెల్లం , పట్టిక భారీ స్థాయిలో స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

మిర్యాలగూడ నవంబర్ 21:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మాడ్గులపల్లి టోల్ గేట్ వద్ద గురువారం రూట్ వాచ్ లో అశోక్ లేలాండ్ ట్రాలీలో తరలిస్తున్న సుమారు 944 కిలోల బెల్లం, 120 కిలోల పటిక స్వాధీనం చేసుకున్నామని మిర్యాలగూడ ఎక్సైజ్ సిఐ ఎల్.మహేశ్వరరెడ్డి తెలిపారు. నిందితులు దేగల రమేష్, లొట్లపల్లి మహేష్ లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ట్రాలి, బెల్లం, పటిక స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రూట్ వాచ్ లో ఎస్ఐలు ఎస్కే పర్వీన్, వై.లావణ్య, జె.రాఘవేంద్ర గౌడ్, కానిస్టేబుల్స్ వి. శ్రీనివాస్ రెడ్డి, సిహెచ్ ప్రభువరంలున్నారు.



## ఈనెల 27న ఎల్బీ స్టేడియంలో క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో జాతీయ ప్రార్థన దినం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ నవంబర్ 21...... ఈనెల 27న ఎల్బీ స్టేడియం లో జాతీయ ప్రార్థన దినమును నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మాజీ ఎమ్మెల్సీ, క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ డి. రాజేశ్వరరావు, జీసస్ రీడిమ్స్ మినిస్ట్రీస్ స్పీకర్ మోహన సి. లాజరస్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఓయూలో అందుకు సంబంధించిన బ్రోచర్లను వారు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ ప్రార్థన దిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ నచానిల్, ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ గడ్డం అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి కార్యక్రమానికి వివిధ విద్యార్థులు ప్రజాసంఘాలు అదేవిధంగా ఆ క్రైస్తవ నాయకులు హాజరయ్యారు. తెలంగాణలో అదేవిధంగా దేశంలో ఉన్నటువంటి క్రైస్తవులందరికీ అదేవిధంగా క్రైస్తవ ఇతరులు అందరికీ కూడా ప్రేమ సమానత్వము సమన్వయం జరగాలని అదేవిధంగా అందరికీ అందరు కూడా ఆరోగ్యంగా అదేవిధంగా మంచిగా సంతోషంగా కోరుకుంతున్నట్లు ఎమ్మెల్సీ రాజేశ్వరరావు మాట్లాదారు. ఈ కార్యక్రమంలో జాన్ పాల్గొన్నారు.